
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

3

సోమవారం 1 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:35

సహర్ - మంగళవారం
ఉదయం - 4:48

జుంటు వాగు ఖాళీ



వానాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జుంటివాగు(ఫైల్)

'ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టు.. భూగర్భ జలాల సంరక్షణకు అదే మేలు' అనే నినాదంతో ప్రభుత్వ యంత్రాంగం విస్తృత చేస్తున్నా.. ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో జుంటివాగు వానాకాలంలో నీటి ఉధృతితో ప్రవహిస్తుంటుంది. ఈ వాగుకు ఇరువైపులా పలువురు రైతులు బోర్లు వేశారు. వానాకాలంలో వాగు చెక్‌డ్యాంపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో చెక్‌డ్యాం ఓ పక్క వింగ్‌వాల్ శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో నీరు నిల్వ ఉండటం లేదు. అయితే వింగ్‌వాల్‌కు రెండేళ్ల కిందట మరమ్మతులు చేపట్టినప్పటికీ మళ్లీ కూలిపోయి నీరంతా వృథా పోతోందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, మార్చి చివరి వారంలోనే జుంటివాగులో నీరు లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెక్‌డ్యాం పక్కన పాక్షికంగా దెబ్బతిన్న వింగ్‌వాల్‌ను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

- బషీరాబాద్, మార్చి 30

● వానాకాలంలో వృథా.. వేసవిలో కరువు ● వింగ్‌వాల్‌ను పునర్నిర్మించాలని రైతుల వేడుకోలు



ప్రస్తుతం ఖాళీ అయిన జుంటివాగు

ఇక్కడ కోడ్ వర్తించదా?

» లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తొలగించని ఫ్లెక్సీలు



బొక్కోనిగూడలో రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు

ఘట్‌కేసర్, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బొక్కోనిగూడలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేశారు. స్థానిక ఎదులాబాద్ రోడ్డు నుంచి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శుక్ర, శని వారాల్లో దాదాపు కిలోమీటర్ పొడవునా ఆయా పార్టీల ప్రజాప్రతినిధులకు, నాయకులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, మున్సిపల్ అధికారులు ఇప్పటికే ఫ్లెక్సీలను తొలగించారు. పోస్టర్లు కనిపించకుండా సున్నం వేశారు. కానీ, ఇక్కడ మాత్రం దారి పొడవునా ఉన్న ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. అధికారులకు ఎన్నికల నియమావళి గుర్తుకు రాకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.86లక్షలు స్వాధీనం

» బంగారం, వెండి సీజ్



పట్టుబడిన నగదు, బంగారం, వెండిని చూపుతున్న ఎస్ఐ శ్రీశైలంయాదవ్

దౌల్తాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీల్లో పోలీసులు రూ.2.86లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కల్ నుంచి హైదరాబాద్‌కు కారు(ఏపీ 39 డీపీ 9421)లో రూ.లక్షా 68వేలా 500 నగదు, మూడు తులాల బంగారం, 800గ్రాముల వెండి తరలిస్తుంగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా యాద్గీర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కారు(కేఏ 33 ఎం 9833)లో రూ.లక్షా 17వేలా 500 నగదును తరలిస్తుండగా పట్టుకున్నారు. అయితే నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీశైలంయాదవ్ తెలిపారు. ఎన్నికల నియామావళికి విరుద్ధంగా ఎలాంటి పత్రాలు లేకుండా రూ.50వేలకు మించి నగదును తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ ముతరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



వేతన వెతలు!

జీతాల కోసం పౌరగ్రంథాలయ ఉద్యోగుల ఎదురుచూపులు

ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. పౌర గ్రంథాలయాల ఉద్యోగులు మాత్రం నెల మొదటిరోజు వేతనం పొందలేకపోతున్నారు. పౌర గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు ఇంకా ఫిబ్రవరి వేతనాలకు నోచుకోవడం లేదు. వారికి జీతాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. సక్రమంగా వేతనాలు అందక బ్యాంకు, హౌసింగ్ రుణాలు, ఇతర ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి వేతనం రాకపోవడంతో తమ కుటుంబ అవసరాలు తీర్చడం కూడా కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» రాష్ట్రంలో 12 జిల్లాలకు ఇంకా అందని ఫిబ్రవరి నెల వేతనం

» మూడు జిల్లాలకు అందని జనవరి, ఫిబ్రవరి నెలల వేతనం

» నాలుగు నెలలుగా వేతనానికి నోచని నారాయణపేట జిల్లా గ్రంథపాలకులు, సిబ్బంది

వికారాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ప్రభుత్వ, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగులు నెలమొదటి రోజునే వేతనం అందుకుంటూ ఉంటే.. పౌర గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు మాత్రం మార్చి నెలాఖరుకు చేరుకున్నా ఇంకా ఫిబ్రవరి వేతనాలకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొన్ని జిల్లాల్లోని పౌర గ్రంథాలయ ఉద్యోగులకు నెలనెలా వేతనం వస్తూ ఉంటే.. కొన్ని జిల్లాల్లో మాత్రం ఆ ఉద్యోగులకు వేతనం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో పౌర గ్రంథాలయ ఉద్యోగులకు ఫిబ్రవరి నెల వేతనం మాత్రం రావాల్సి ఉండగా, కొన్ని జిల్లాల్లో జనవరి, ఫిబ్రవరి నెలల వేతనం అందాల్సి ఉంది. అయితే నారాయణపేట జిల్లాలోని పౌర గ్రంథాలయ ఉద్యోగులు మాత్రం నాలుగు నెలల నుంచి వేతనాలకు నోచుకోవడం లేదు. పౌర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతన చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. పౌరగ్రంథాలయాల ఉద్యోగులు మాత్రం నెల మొదటి రోజు వేతనం పొందలేకపోతున్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా వేతనాలు అందక బ్యాంకు, హౌసింగ్ రుణాలు, ఇతర ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా చెల్లించాల్సిన రుణవాయిదాలను నిర్ణీత తేదీలోగా చెల్లించకపోతే సిబిల్ స్కోర్ పడిపోయి రాబోయే రోజుల్లో రుణాలు తీసుకునే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని వారు వాపోతున్నారు. నెలల తరబడి వేతనం రాకపోవడంతో తమ కుటుంబ అవసరాలు తీర్చడం కూడా కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకూ ఒకటో తేదీనే వేతనం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

12 జిల్లాల్లో అందని ఫిబ్రవరి వేతనం

మార్చి నెలాఖరుకు వచ్చినా రాష్ట్రంలో ఇంకా 12 జిల్లాల్లో గ్రంథాలయ ఉద్యోగులు ఇంకా ఫిబ్రవరి నెల వేతనానికి నోచుకోవడం లేదు. రాష్ట్రంలో ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, గద్వాల జోగులాంబ, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పని చేస్తున్న గ్రంథ పాలకులకు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ఫిబ్రవరి నెల వేతనం ఉద్యోగులకు అందగా, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల్లోని గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ఇంకా ఫిబ్రవరి వేతనం అందలేదు. మంచిర్యాల, వనపర్తి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గ్రంథాలయ ఉద్యోగులకు జనవరి, ఫిబ్రవరి నెలల వేతనం రావాల్సి ఉండగా, నారాయణపేట జిల్లాలో గ్రంథాలయ ఉద్యోగులకు 2023, నవంబరు, డిసెంబరు, 2024 జనవరి, ఫిబ్రవరి నెలల వేతనం పెండింగ్‌లో ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా పౌర గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది వేతనాలకు సంబంధించి రూ.1,91,58,839 బిల్లులు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన వేతనం వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాల ఉద్యోగులు కోరుతున్నారు.

15 నెలలుగా పెన్షన్ ప్రయోజనాలు పెండింగ్

ఇదిలా ఉంటే, వికారాబాద్ జిల్లాలో గ్రంథ పాలకుడిగా పని చేస్తూ మృతిచెందిన ఆర్.అంజయ్య అనే ఉద్యోగికి పెన్షన్ ప్రయోజనాల కింద రూ.13,74,054 రావాల్సి ఉండగా, ఆ బిల్లు 2022, డిసెంబరు నెల నుంచి ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉంది. తమకు రావాల్సిన పెన్షన్ ప్రయోజన కోసం బాధిత కుటుంబం సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి వేదనలో ఉన్న తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచితే తమను ఎవరు ఆదుకుంటారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలనెలా వేతనం ఇప్పించండి

నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రేడ్-3 గ్రంథపాలకురాలిగా పనిచేస్తున్న శిల్ప నెలనెలా వేతనం ఇప్పించాలని ఈనెల 15న అక్కడి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆమె చెవిటి, మూగ వికలత్వం కలిగిన ఉద్యోగిని. నాలుగు నెలలుగా వేతనం రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తన కుటుంబానికి వేతనం తప్ప ఇతర ఆర్థిక ఆధారాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సర్వం సిద్ధం!

» నేటి నుంచి ధాన్యం సేకరణ

» ఈసారి ఐరిస్ విధానం తెరపైకి..



మేడ్చల్ మార్చి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : యాసంగి సీజన్ ధాన్యనం కొనుగోలుకు ప్రభుత్వ పరంగా పౌరసరఫరాల శాఖ అధికారులు సంసిద్ధమయ్యారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేశారు. వడ్ల కొనుగోలుకు జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మొదట మండలానికి ఒకటి చొప్పున ఐదు మండలాల్లో ఏర్పాటు చేయనున్నారు. సేకరణలో అక్రమాల అడ్డుకట్టకు ప్రభుత్వం ఈసారి ఐరిస్ విధానం తెరపైకి తెచ్చింది. ఈసారి నెలరోజులు ఆలస్యంగా రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కోత దశకు రాలేదు. ఇప్పటి వరకు కొన్ని చోట్ల మాత్రమే పొట్ట దశకు రాగా కొన్ని ప్రాంతాల్లో ఆ స్థాయిలోనూ లేదు. పంట కోతకు రావాలంటే ఇంకా నెల నుంచి నెలన్నర సమయం పట్టే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మొదట మండలాల్లో ఒక్కో కొనుగోలు కేంద్రం తెరిచేలా కార్యాచరణ చేయగా, క్రమక్రమంగా 12 కేంద్రాలు ప్రారంభించి సేకరించనున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు మిల్లర్లతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని స్పష్టం చేశారు.

తెరపైకి ఐరిస్ విధానం..

ప్రభుత్వం సాధారణ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,183, గ్రేడ్ - ఏ రకానికి రూ.2203 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరతో కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు. రైతుల రూపంలో వ్యాపారులు, ఇతరులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించకుండా అడ్డుకట్ట వేసేలా పౌరసరఫరాలశాఖ ఈసారి ఐరిస్ విధానం తెరపైకి తెచ్చింది. ఇదివరకు అన్నదాతలు ఓటీపీ ద్వారా ధాన్యం విక్రయించే అవకాశం ఉండేది. దీంతో వ్యాపారులు, దళారులు, ఇతరులు రైతుల పేరున వారి ఓటీపి చెప్పి విక్రయిస్తున్నట్లు గమనించిన సర్కారు, ఐరిస్(కనుబొమ్మల స్కాన్) ద్వారా కొనుగోళ్లు జరపాలని ఆదేశించింది. కేంద్రానికి వచ్చే రైతు ఆధార్, బ్యాంకుఖాతా, ఆధార్ అనుసంధానం కలిగిన ఫోన్ నంబరుతో విక్రయించాల్సి ఉండేది. ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నిర్వాహకులు ట్యాబ్‌లో నమోదు చేసి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఈ విధానం యథావిధిగా కొనసాగిస్తూనే కొత్తగా ఐరీస్ సైతం తీసుకోవాలని ఆదేశించింది. అంటే పట్టా పాస్‌పుస్తకం కలిగి సాగు చేసిన రైతే కేంద్రానికి వచ్చి విక్రయించాలి. ఇతరులు వస్తే కుదరదు. ఒకరి ధాన్యం మరొకరు విక్రయించకుండా అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి కేంద్రం వద్ద వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి ఉండేలా చూడాలని అధికారులు ఆదేశించారు. ట్యాబ్‌లో పేరు నమోదు కాని రైతు ఏఈఓ ధ్రువీకరణతో సైతం విక్రయించవచ్చునని అధికారులు పేర్కొన్నారు.

ఒకేసారి స్థానిక సంస్థల ఎన్నికలు

» పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

తాండూరు, మార్చి 31: ఎంపీ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో తమకు స్పష్టం చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు. తాండూరు పట్టణం క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన తాండూరు కాంగ్రెస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డుసభ్యులకు ఒకేసారి ఓటు వేసే విధంగా ఎన్నిక జరగబోతోందని వెల్లడించారు. ఈ విషయాన్ని స్వయంగా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారని అన్నారు. ప్రతీ గ్రామంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకుంటున్నారని వెల్లడించారు. పనిచేసే కార్యకర్తలకు తప్పనిసరి గుర్తింపు ఉంటుందన్నారు. పదవుల కేటాయింపులకు తగిన ప్రాధాన్యం ఇస్తారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని రూ.10లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టివేశారని దుయ్యబట్టారు. రూ.38వేల కోట్లు కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాపారంలో ఉన్న తాను రాజకీయ సేవ చేయాలనే ఉద్దేశంతోనే ప్రజల వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరుకు సమీపంలో ఎర్రన్‌పల్లి వద్ద మెడికల్ కళాశాల రాబోతుందని తెలిపారు. కొడంగల్, తాండూరు అనుసంధానంతో తాండూరు అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తానని తెలిపారు. ఎంపీగా రంజిత్‌రెడ్డి గెలిస్తే కేంద్రంలో వెంటబడి రోడ్డు మంజూరు చేస్తానన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, డీసీసీబీ మాజీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మురళీ కృష్ణ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్, రవిగౌడ్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఘనంగా ఈస్టర్ వేడుకలు

మర్పల్లి/వికారాబాద్, మార్చి 31: మర్పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని శిలువ గుట్టకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మెథడిస్టు సంఘ కాపరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని 21వ వార్డు ఎంజీ కాలనీలో ఇమాన్యుయల్ ఏజీ చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అక్కడికి వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వికారాబాద్ మునిసిపల్‌తోపాటు ఆయా మండలాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



మర్పల్లిలో శిలువగుట్టపై ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి

● మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ మార్చి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదుకు సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టినా, మద్యం సరఫరా చేసినా, నేర పూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా, ఫిర్యాదులు తాజాగా ఫొటోలు తీసి, వీడియోలు, ఆడియో రికార్డ్ ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100 నిమిషాల లోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామన్నారు. సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులు ఐదు నిమిషాల్లోపు జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో గల మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిముషాల్లోపు క్షేత్రపరిశీలన అధికారి అయిన ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందం విచారణ నిమిత్తం పంపబడుతుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం 15నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకుని, క్షేత్ర విచారణ జరిపి 30నిమిషాల్లో వివరాలు సేకరించి నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తారన్నారు. దానిపై రిటర్నింగ్ అధికారి 50నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నంబర్‌ను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. సి-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదులు చేయాలన్నారు. తీరా ఆప్రదేశానికి చేరుకునే లోపు ఆధారాలు లేకుండా ఉండటంతో సమయం వృథా అవుతుందన్నారు. ఇప్పటి వరకు సి విజిల్ యాప్ ద్వారా 13కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలి

● సీపీఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య

బొంరాస్‌పేట్, మార్చి 31: డీఎస్సీ పరీక్షకు నిరుపేద నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని సీపీఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ, ఉద్యోగాలను భర్తీ చేయడం హర్షనీయమన్నారు. సీఎం సొంత నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో పేద కుటుంబాల నిరుద్యోగులు ఉన్నారని వీరందరూ డీఎస్సీ పరీక్షకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ధ్యానంతో ఆరోగ్యవంతమైన జీవితం

కులకచర్ల, మార్చి 31: రోజూ ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని చాపలగూడెం, తిరుమలపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే మానసిక ఒత్తిడి నుంచి బయటపడతామని ఆయన తెలిపారు. తలనొప్పి నుంచి క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులు ధ్యానం ద్వారా తగ్గుతాయన్నారు. నాడీ మండల శుద్ధి జరిగి రోగనిరోధక శక్తి పెరిగేందుకు ధ్యానం దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్‌సంస్థ సభ్యులు యాదయ్య, తిరుపతయ్య, బాలకృష్ణారెడ్డి, శైలజ, శోభిత, వెంకటేశ్, శ్రీనివాస్, పూజ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం


స్వామివారికి బోనం సమర్పిస్తున్న సునీతామహేందర్‌రెడ్డి

శామీర్‌పేట, మార్చి 31: తూంకుంటలో నూతనంగా నిర్మించిన శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణం, అగ్నిగుండాలు తొక్కుట, గొలుసులు తెంపుట నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కుట, గొలుసులు తెంపుట నిర్వహించారు. సాయంత్రం భక్తులు పెద్దఎత్తున బోనాలను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి స్వామివారికి బోనం సమర్పించగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, వివిధ గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కీసర రూరల్, మార్చి 31: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో దమ్మాయిగూడలోని క్రాంతి కీన్ విద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. గత జనవరి 20న ప్రవేశ పరీక్ష జరగ్గా ఆదివారం ఫలితాలు వెలువడ్డాయి. ఈ పరీక్షకు క్రాంతి కీన్ పాఠశాల నుంచి 62మంది హాజరు కాగా 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు


ఇఫ్తార్ విందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఖజూర్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 31: తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేష్ మహరాజ్, ప్రజాప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

నేడు వికారాబాద్‌లో..

వికారాబాద్: వికారాబాద్ పట్టణంలో సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని మైనార్టీలందరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. 10వేల మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తుండగా మైబూబ్ అలామ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకావాలన్నారు.

ధారూరు: రంజాన్ సందర్భంగా రాష్ట్ర శాసన సభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ సోమవారం(నేడు) ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మండలంలోని ముస్లింలు తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయాబ్ అన్సారీ తెలిపారు.మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి ముస్లింలను కలిసి ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ వికారాబాద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్నారని ఆయన చెప్పారు. మండలంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందుకు రావాలని ఆయన కోరారు.

రేపు మేడ్చల్‌లో..


మైనంపల్లి హనుమంత రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్: కాంగ్రెస్ పార్టీ తరఫున రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రేపు(మంగళవారం) పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆదివారం మేడ్చల్ మున్సిపల్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత రావు, మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, నక్కప్రభాకర్ గౌడ్‌లకు కలిసి ఇఫ్తార్ విందు ఆహ్వాన పత్రికను అందజేశారు. వీరితో పాటు మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలను ఆహ్వానిస్తున్నారు. మేడ్చల్‌లోని మహేశ్వరి, పరమేశ్వరి గార్డెన్‌లో దాదాపు 1500మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మణికంఠ గౌడ్, చపరాజు, నాయకులు సయ్యద్ లాయక్ అలీ, ఎండీ రఫీక్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


సారా నిల్వలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొడంగల్, మార్చి 31:మండలంలోని మైసమ్మగడ్డ, బోజన్నగడ్డ, బుర్రి, నంద్యానాయక్, ఎల్‌జీ, కిష్యనాయక్ తండాల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొడంగల్, పరిగి, తాండూర్, మోమిన్‌పేట్, వికారాబాద్ సర్కిల్ సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆయా తండాల్లో 13లీటర్ల సారా, 800లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ కొడంగల్ సర్కిల్ సీఐ వెంకటేశం తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురిపై కేసులు నమోదు చేయగా ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా సారా, నల్లబెల్లంను అమ్మినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ అపహరించిన నిందితుడి అరెస్ట్


నర్సింహ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 31: ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ద్విచక్రవాహనాలను దొంగిలించిన నిందితున్ని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన నన్నిల శ్రీకాంత్ తన బైక్(ఏపీ-24-జే-2158)ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెల 30న పార్క్‌చేసి ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. పరిసరాలను వెతికినా బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి పిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు యంనంపేట్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాదారున్ని అదుపులోకి తీసుకోని విచారించారు. తానే బైక్‌ను అపహరించినట్లు యాదాద్రీ-భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, నాగారం గ్రామానికి చెందిన నర్సింహా విచారణలో తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. దీంతో నిందితున్ని అరెస్టు చేసి, కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హారన్ కొట్టాడని డీసీఎం డ్రైవర్‌పై దాడి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 31: హారన్ కొట్టాడని డీసీఎం డ్రైవర్‌పై దాడిచేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు నుంచి హైదరాబాద్‌కు కోళ్ళలోడుతో వెళ్తున్న డీసీఎం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ చౌరస్తా సమీపంలోని వంతెనవద్ద రోడ్డు మధ్యలో రెండు బైకులు ముందు వెళ్తుండగా హారన్ కొట్టాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన రెండు బైక్‌ల యువకులు రోడ్డుపై బైక్‌లను ఆపి డీసీఎం డ్రైవర్ కేశవులుపై దాడికి పాల్పడ్డారు. దెబ్బలకు తాళలేక డ్రైవర్ 100కు సమాచారం అందించడంతో స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి పాల్పడిన వారిలో ఘట్‌కేసర్‌కు చెందిన మహేష్, సయ్యద్, తేజతో పాటు ఓ బాలుడు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అవినీతిపరులకు కాంగ్రెస్‌లో చోటులేదు


కీసర ఎంపీపీని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి

కీసర, మార్చి31: అవినీతి పరులకు కాంగ్రెస్ పార్టీలో చోటులేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఆదివారం చీర్యాల్‌లోని ఎంపీపీ ఇందిర లక్ష్మీనారాయణ నివాసానికి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌లు రావడం జరిగింది. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏప్రిల్ 6వ తేదీ నుంచి మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, ఇతర పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు. భూబకాసరుడు, అవినీతిపరుడు, కబ్జాదారుడు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి సహకరించిన కొంతమందికి మినహా మిగతా వారు అందరు భారీ సంఖ్యల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరబోతన్నారని, రానున్న కొన్ని రోజుల్లోనే బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, కీసర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు జూపల్లి రవీందర్, మధు యాదవ్, సీనియర్ నాయకులు ఉమాపతి శర్మ, వేణు, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


మైసమ్మ దేవాలయం వద్ద డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, మార్చి 31: కందనెల్లి గ్రామంలోని మైసమ్మ దేవాలయంలో రెండురోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద కురుమ యాదవులు డోలు వాయిస్తుండగా ఎమ్మెల్యే కూడా ఒక డోలు తీసుకుని వాయించారు. ఎమ్మెల్యే వెంట వైస్‌ఎంపీపీ మధులత, మాజీ సర్పంచ్‌లు లక్ష్మి, ఇలాయత్, కిరణ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

యాలాల: మండలంలోని అచ్యుతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ మదుసూధన్ రెడ్డి ఆదివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మధుసూధన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా రాఘవపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అచ్యుతాపూర్ రాఘవపూర్ గ్రామానికి చెందిన సుమారు 300 మంది బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కోఆప్షన్ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్ బాబా, మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధారూరు అటవీ రేంజర్‌కు ఘన సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన రేంజర్ కృష్ణను సన్మానిస్తున్న అధికారులు

ధారూరు, మార్చి 31: ఉద్యోగ విరమణ పొందిన ధారూరు అటవీ రేంజ్ అధికారి కృష్ణను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ధారూరులో శనివారం రాత్రి నిర్వహించిన పదవీ విరమణ వీడ్కోలు సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొని మాట్లాడారు. రేంజర్‌స్థాయికి ఎదిగిన కృష్ణ తన పదవీ కాలాన్ని సమర్థవంతంగా పూర్తి చేశారని అన్నారు. తాను విధి నిర్వహణలో ఎదుర్కొన్న సవాళ్లను, అనుభవాలను విశ్రాంత సమయంలో అటవీశాఖ అధికారులకు తెలపాలని కోరారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని ఆయన అకాంక్షించారు. కాగా పదవీ విరమణ పొందిన రేంజర్ కృష్ణ దంపతులను డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఆర్‌వో జగన్‌మోహన్, సెక్షన్ అధికారులు రాజేందర్‌రెడ్డి, మోయినోద్దీన్, బీట్ అధికారులు నరేష్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్‌గా అరుణ

పదవీ విరమణ పొందిన అటవీ రేంజ్ అధికారి కృష్ణ స్థానంలో వికారాబాద్ అటవీ రేంజర్ అరుణకు ఇన్‌చార్జి రేంజర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీచేశారు. ధారూరు రేంజ్‌కు ఆమె రేంజర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

చుట్టూ ఏం జరుగుతుందో నిఘాపెట్టాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

వికారాబాద్, మార్చి 31: మన చుట్టూ ఏం జరుగుతుందో నిఘా పెట్టాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్‌లో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 35వాహనాలను సీజ్ చేశారు. అందులో ఆటోలు, బైక్‌లు ఉండగా వాటికి సంబంధించి ధ్రువపత్రాలను తీసుకొచ్చి చూపించి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో కొత్తగా ఎవరైనా వస్తే వారిపై దృష్టిపెట్టి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సీఐ, 10మంది ఎస్ఐలు, 65మంది కానిస్టేబుల్స్ ఆరుగురు హోంగార్డులు పాల్గొన్నట్లు తెలిపారు.

మల్కాజిగిరిలో బీజేపీ విజయం ఖాయం


చంద్రారెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

కీసర రూరల్, మార్చి 31: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అఖండ విజయం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. నాగారం మున్సిపాలిటీలోని మారుతి గార్డెన్‌లో ఆదివారం భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, యూత్ నాయకుడు రాహుల్‌రెడ్డి, వీరితో పాటు మున్సిపాలిటీకి చెందిన కార్యకర్తలు పెద్దఎత్తున బీజేపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 12కు పైగా ఎంపీ సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసారు. చైతన్య వంతులైన 70శాంతం మంది వలసదారులతో మల్కాజ్‌గిరి నియోజకవర్గం విస్తరించిందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ఐదు సంవత్సరాలు కొనసాగిన రేవంత్‌రెడ్డి ఇక్కడ చేసిందేమీలేదని ఆరోపించయారు. ఆయన ప్రాతినిత్యం వహించిన నియోజకవర్గంలో ఒక్క కార్పొరేటర్ గానీ, మున్సిపాలిటీ చైర్మన్‌ను గానీ, ఒక్క ఎమ్మెల్యేను గెలుపించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. అధికార పార్టీపైన అసంతృప్తితో గెలుపొందిన రేవంత్‌రెడ్డి, అధికార అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉగ్రేక శక్తుల చర్యలకు కళ్లెం పడిందన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనతో పాటు, ఈటల రాజేందర్ నాయకత్వంపై నమ్మకంతో బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పెద్ది మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు వేణు, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సురేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏకేఆర్ స్టడీ సర్కిల్ మెటీరియల్‌ను వినియోగించుకోవాలి


మెటీరియల్‌ను విడుదల చేస్తున్న అసెంబ్లీ స్పీకర్

వికారాబాద్, మార్చి 31: గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగాలు అంటే అందని ద్రాక్షలా ఉన్న సమయంలో పేద, మధ్య తరగతి నిరుద్యోగులకు ఉన్నతమైన శిక్షణ ఇచ్చి జిల్లాలోనే అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలను అందించిన స్టడీ సర్కిల్ ఏకేఆర్ స్టడీ సర్కిల్ అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణంలో ఆదివారం 10పుస్తకాలతో కూడిన డీఎస్సీ ఎస్‌జీటీ స్కూల్ అసిస్టెంట్ స్టడీ మెటీరియల్‌ను స్పీకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నిరుద్యోగులు ఏకేఆర్ స్టడీ సర్కిల్ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. డైరెక్టర్ రమణ మాట్లాడుతూ.. విద్యా వ్యాపారంగా కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యను వ్యాపారంగా కాకుండా సేవా దృక్పథంతో అందించాలని నెలకొల్పిన సంస్థ ఏకేఆర్ స్టడీసర్కిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధార్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, రెడ్యానాయక్, అరుణ్ కుమార్, మాలే లక్ష్మణ్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో అక్రమాల అడ్డుకట్టకు 'సీ-విజిల్'



దౌల్తాబాద్, మార్చి 31: ఎన్నికల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాజకీయ పార్టీలు ప్రవర్తన నియామావళిని ఉల్లంఘిస్తే సాక్ష్యాలతో పాటు అందులో పొందుపర్చవచ్చు. ఉల్లంఘనలకు సంబంధించిన ఫోటో, వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో యాప్‌లో ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై ఎన్నికలకు సంబంధించిన అధికారులు విచారణ చేపట్టిన 100 నిమిషాల్లో పిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


కులకచర్ల: పాంబండ దేవాలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

కులకచర్ల, మార్చి 31: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం దేవాలయంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. అర్చకులు పాండు శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఘనంగా భవానిమాత ఉత్సవాలు

పరిగి: కాళ్ళాపూర్ శివారులోని లొంగక్షేత్రంలోని అంబభవానికి మాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, బీఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి,నాయకులు మహేందర్, శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పోచమ్మతల్లి విగ్రహప్రతిష్ఠాపన

పరిగి: సయ్యద్‌పల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మతల్లి దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనలు, హోమగుండాలు, శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. భవానీమాత పీఠాధిపతి శంకరాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు టి.రామస్వామి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు పి.నర్సింహులు, డీసీసీ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, ఎస్టీసెల్ అధ్యక్షుడు తావుర్యానాయక్ పాల్గొన్నారు.

నేడు శంకరస్వాముల పుణ్య సంస్మరణోత్సవం

వికారాబాద్: వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి కెంపిన మఠం దివంగత పీఠాధిపతి శంకరస్వాముల 24వ పుణ్య సంస్మరణోత్సవ కార్యక్రమం ఏప్రిల్ ఒకటో తేదీ, సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కెంపిన మఠంలో షట్ స్థల ధ్వజారోహణం, గురుపీఠానికి మహా రుద్రాభిషేకం, అర్చన, మంగళ హారతులు నిర్వహించనున్నట్లు వివరించారు. కెంపిన మఠం పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవప్రభుస్వామి అధ్యక్షతన కొనసాగే ఈ కార్యక్రమానికి తంగెడపల్లి పీఠాధిపతి శివయోగి శివాచార్యస్వామి, కత్తెపల్లి సచ్చిదానంద షట్‌స్థల సంస్థాపకులు ఉమాపతయ్యస్వామి, ప్రధాన వక్తగా పోలె విశ్వనాథం హాజరవుతున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

నిజమైన నాయకులకు గుర్తింపేది?

బషీరాబాద్, మార్చి 31: కాంగ్రెస్‌లోకి నిన్న మొన్న వచ్చిన బీఆర్ఎస్ నేతలకు గుర్తింపు నివ్వడం తగదని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మాధవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరులో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి హాజరుకాగా అక్కడ స్టేజిపైకి పార్టీ కోసం పని చేసిన నాయకులను కొందరిని పిలువకుండా విస్మరించారన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారి పేర్లు చెబుతూ స్టేజిపై కూర్చోబెట్టి తనను అవమానపరచడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్‌లోనే ఉంటూ కష్టనష్టాలకు ఓరుస్తూ పని చేస్తున్నా తన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** అంతారంలో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కోట్‌పల్లి గ్రామ శివారులోని సిలువ వద్ద క్రైస్తవులు ఉదయం నుంచి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించారు. ఏసు కీర్తనలు, సూక్తులు పాస్టర్ బోధించారు. జినుగుర్తి, కరన్‌కోట్, బెల్కటూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను నిర్వహించుకున్నారు.

● **బషీరాబాద్:** కాశీంపూర్ నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు ప్రజా ఆశీర్వాద యాత్ర ఉంటుందని జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ కులకర్ణి తెలిపారు. ఈయాత్రలో బీజేపీ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ యాత్ర ప్రధానమార్గం గుండా గొట్టిగఖుర్దు, నవాల్గ, పర్వత్‌పల్లి, మర్పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, మైల్వార్, ఎక్మాయి, మంతన్‌గౌడ్, బషీరాబాద్ మీదుగా రాత్రి 7గంటల వరకు జీవన్గి చేరుకుంటుందన్నారు.

● **బషీరాబాద్:** ప్రస్తుతం మార్చి చివరి వారం నుంచే ఎండలు మండిపోతూ గాలిలో తేమా శాతం తగ్గిపోవడంతో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగున్నందున ప్రజలు, ఉపాధి కూలీలు తాగు జాగ్రత్తలు పాటించాలని బషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.చిన్నారులు, వృద్ధులు ఎండలో బయటకు వెళ్లవద్దని, ఉపాధి కూలీలు ఎండ ముదరకముందే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఘట్‌కేసర్, మార్చి 31: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఐడియా ఎస్టేట్ సంస్థ అధినేత బి.పవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ జడ్పీస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐడియా సంస్థ ఆర్థిక సహకారంతో రూ.75వేలు వెచ్చించి నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేశారు. తన తండ్రి మదుసుదన్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్లాంటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడియా ఎస్టేట్ ప్రతినిధి రవీందర్‌రెడ్డి, దాత పవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ మార్నింగ్ వాక్

ఘట్‌కేసర్, మార్చి 31: కాలనీల్లో ఎమైన ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, లక్ష్మి నగర్, సత్యసాయినగర్ కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కాలనీల్లో పర్యటిస్తూ కాలనీవాసులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మున్సిపాలిటీల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో తాగునీటి ఎద్దడి


వాటర్ ట్యాంకు వద్ద బిందెలను లైన్‌లో పెట్టిన మహిళలు

తాండూరురూరల్, మార్చి 31: మల్కాపూర్‌లో నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 1, 2వ వార్డు ప్రజలకు పోచమ్మదేవాలయం వద్ద ఉన్న బోరు మోటారు నుంచి నీరు సరఫరా అవుతోంది. నాలుగు రోజుల కిందట బోరు మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో వార్డు ప్రజలకు తాగునీటి ఎద్దడి మొదలైంది. బోరుమోటారు పాడై నాలుగు రోజులు గడిచినా అధికారులు ఎవరూ పట్టించుకోవడంతో నీటిఎద్దడి ఝఠిలంగా మారింది. దీంతో కాలనీవాసులు గ్రామపంచాయతీ నుంచి వచ్చే వాటర్ ట్యాంకు వద్ద మహిళలు పెద్దఎత్తున గుమిగూడి బిందెలతో నీటిని పట్టుకుంటున్నారు. ట్యాంకర్‌తో సరఫరా చేసినా నీళ్ల సరిపోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. బోరుమోటారు మరమ్మతులకు గురైనా గ్రామ ప్రత్యేకాధికారి పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ ఘట్‌కేసర్ మండల యువజన అధ్యక్షుడు వినోద్ కుమార్



ఘట్‌కేసర్, మార్చి 31 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఘట్‌కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ ఆదివారం ముఖ్యమంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఘట్‌కేసర్ మండల పరిధిలోని చౌదరిగూడకు చెందిన వినోద్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ సీఎంను కలవడం ఆనందంగా ఉందన్నారు.